# సెంటిమెంట్స్

- మనోహర్‌రావు

"సారీ సర్, మీ అకౌంట్‌లో అంత డబ్బు లేదు'' చెక్ తిరిగి ఇచ్చేస్తూ, ఇంగ్లీషులో చెప్పాడు బ్యాంకు కాషియర్.

అవినాష్ ఆశ్చర్యపోయాడు. క్రితం రాత్రి ఏ.టి.ఎం.లో డబ్బు డ్రా చేసుకున్నప్పుడు ఎనభైవేలకు పైగా వుంది. ఉదయమే తన భార్య డ్రా చేసుంటుందనుకున్నాడు. అవినాష్, అతని భార్య మానసలది జాయింట్ అకౌంట్.

"ఎంతుంది అకౌంట్‌లో'' కాషియర్‌ను అడిగాడు.

"ముప్పయివేలు సార్.''

కాషియర్‌కు థాంక్స్ చెప్పి బ్యాంకు నుండి బయటకు వచ్చాడు. అతనికి భార్య మీద కోపం వచ్చింది. యాభైవేలు ఒక్కసారిగా డ్రా చేయాల్సిన అవసరం ఏమొచ్చింది. అదీ తనకు చెప్పకుండా.

జేబులో నుండి మొబైలు తీసి, భార్య మొబైల్‌కు రింగ్ చేశాడు.

"హలో, మనూ, ఈరోజు డబ్బు డ్రా చేశావా?''

"అవునండీ, మీకు చెబుదామని మీ మొబైలుకు రింగ్ చేశాను. కానీ అప్పుడు మీ ఫోన్ స్విచ్ ఆఫ్ వుంది.'' అంది మానస.

"అంత అర్జంటు ఏమొచ్చింది, నాకిప్పుడు డబ్బుతో ఒక ముఖ్యమైన పనుంది.'' కొంచెం అరిచినట్టుగా అన్నాడు.

"అదికాదు అవి...'' మానస ఏదో అనబోయింది.

"సరే, ఇప్పుడు నువ్వెక్కడున్నావ్?''

"ఇంట్లోనే, పన్నెండు గంటలకే ఆఫీసు నుండి వచ్చేశాను.''

సరిగ్గా అప్పుడే వర్షం మొదలవడంతో, "మరో పది నిమిషాల్లో ఇంట్లో ఉంటాను'' అని చెప్పి, ఫోన్ కట్ చేసి, కెనెటిక్ హోండా స్టార్ట్ చేశాడు.

అవినాష్, మానసలది లవ్ కమ్ అరేంజ్డ్ మ్యారేజ్. ఇద్దరూ ఎంసియే చేశారు. బెంగుళూరులో రెండు వేరు వేరు మల్టీనేషనల్ కంపెనీల్లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా జాబ్ చేస్తున్నారు. ఇద్దరికీ కలిపి నెలకు అరవై వేలకు పైగా జీతం. బెంగుళూరులోనే ఒక త్రీ బెడ్రూం డీలక్స్ ఫ్లాట్ కొనుక్కున్నారు. ఒక సాంత్రో కారు కూడా వుంది.

కాని ఇద్దరి ఆఫీసులు చెరో దిక్కు ఉండడం వలన, ఇద్దరూ కలిసి ఆఫీసుకెళ్లే అవకాశం లేదు. కాబట్టి మానస కెనెటిక్ పైనా, అవినాష్ కారులో ఆఫీసులకు వెళ్లేవారు. కాని ఇప్పుడు వర్షాకాలం మొదలైంది. అప్పుడప్పుడూ మానస వర్షంలో తడుస్తూ ఇంటికి రావడం అవినాష్‌కు నచ్చక, కారు భార్యకిచ్చి తను కైనెటిక్‌పై వెళుతున్నాడు.

వర్షాకాలంలో ఉపయోగించుకోడానికి ఒక సెకండ్‌హేండ్ కారుకోసం చూస్తున్నాడు అవినాష్. ఈరోజు ఉదయమే, అర్జంటుగా డబ్బు అవసరం ఉన్న ఒకతను కారు చీప్‌లో అమ్ముతున్నాడని తెలిసి అది తీసుకోడానికని డబ్బుకోసం బ్యాంకుకు వెళితే అందులో డబ్బులేదు.

అదీ అవినాష్ కోపానికి కారణం.

అవినాష్ ఇంటికి రాగానే, "డబ్బు మా అక్కకు పంపించానండీ'' అన్న మానస సమాధానం వినగానే అతని కోపం తారాస్థాయికి చేరింది.

"మళ్లీ మీ అక్కకు పంపించావా? నీకేమైనా బుద్ధుందా, ఎన్నిసార్లు పంపిస్తావ్? అడగడానికి ఆమెకైనా బుద్ధుండాలి.'' అరిచాడు అవినాష్.

"ప్లీజ్ అవి, మా అక్క మాటెత్తకండి. మీకు ఇంతకుముందు చాలాసార్లు చెప్పాను, నా పన్నెండవ ఏట తల్లిదండ్రులు చనిపోతే, నాకన్నా కేవలం మూడేళ్లే పెద్దదైన మా అక్క అన్నీ తానై నన్ను పెంచింది. నాకు తలిదండ్రులు లేని లోటు తీర్చింది. అలాంటి తల్లికి కష్టాలు వచ్చినప్పుడు వాటిని తీర్చటం నా బాధ్యత. మా అక్క సున్నిత మనస్కురాలు. ఆమెకు కిరాతకుడైన భర్త దొరకడం ఆమె దురదృష్టం, నా దురదృష్టం. నాకు ఫోన్ చేసి డబ్బు తెప్పించమని రోజూ చిత్రహింసలు పెడుతున్నాడట మా బావ. నిన్న రాత్రి మా అక్క జుట్టు కత్తిరించాడట. ఈరోజు డబ్బు అరేంజ్ చేయకుంటే రేపు గుండు గీస్తానన్నాడట.'' ఏడవడం ప్రారంభించింది మానస.

"మీ అక్క విడాకులు తీసుకోవచ్చుకదా'' శాంతంగా అన్నాడు అవినాష్.

"కూతురేమైపోతుంది, తర్వాత మా అక్క జీవితం ఏమౌతుంది. బావ ఎప్పటికి ఇలాగే ఉండడు కదా, తప్పకుండా మారతాడు. అయినా మీరు అలాంటి సలహా మరోసారి ఇవ్వకండి. అయినా నా డబ్బేకదా నేను పంపించింది-'' అవినాష్ కోపంగా అక్కడినుండి వెళ్లిపోవడంతో, అతని వెనకే వెళ్లి, "సారీ'' అంది.

అతనేమీ మాట్లాడలేదు.

"నావల్ల మీరు ఇబ్బందులపాలవుతున్నారని నాకు తెలుసు. మీ బాధను నేను అర్థం చేసుకోగలను. కానీ నా బాధనూ మీరు అర్థం చేసుకోండి. అక్కడ మా అక్క బాధపడుతుంటే ఇక్కడ నేను సంతోషంగా ఉండలేను.'' అర్థించింది మానస.

"నేనొకసారి వైజాగ్ వెళ్లి మీ బావతో మాట్లాడనా?'' అడిగాడు అవినాష్.

"దయచేసి ఆపని మాత్రం చేయకండి, మరునాడే మా అక్కను చంపేస్తాడు. ఇంతవరకూ నేనే మా బావను ఏమీ అడగలేదు.''

* * *

ప్రతి ఆదివారంలాగానే, ఆరోజూ డిన్నర్‌కి బయటకు వెళ్దామనుకున్నారు అవినాష్, మానస.

ఇద్దరూ రెడీ అయి, బయటకు వచ్చి డోర్ లాక్ చేస్తున్న సమయంలో ఇంట్లో ఫోన్ రింగయింది.

అప్పటికే కారు స్టార్ట్ చేసిన అవినాష్‌తో, "ఒక్క నిమిషం ఉండండి, ఫోనెత్తి మొబైల్‌కు చేయమని చెప్పి వస్తాను'' అని లోపలికి వెళ్లింది మానస.

ఫోనెత్తి "హలో'' అంది.

"మానస...'' అక్క గొంతు, ఏడుస్తోంది.

"అక్కా, ఏమయిందీ'' ఆదుర్దాగా అడిగింది మానస.

"ఏం కాలేదమ్మా, నిన్ను విడిచి వెళ్లిపోతున్నందుకు, నన్ను క్షమించమని అడగడానికి ఫోన్ చేశాను.'' ఏడుపు ఆపుకోడాన్కి ప్రయత్నిస్తోంది.

"అవేం మాటలక్కా, అసలేమయింది'' మానస

క్కూడా దుఃఖం వస్తోంది.

"ఏం కాలేదు. మీ బావ పెట్టే హింసలు నేనింక భరించలేను. మీ బావ నన్ను చంపకముందే నేనే చనిపోవాలని నిర్ణయించుకున్నాను. అందుకే కష్టపడి ఒక పాయిజన్ బాటిల్ సంపాదించాను. చివరిసారిగా నీతో మాట్లాడాలన్పించింది."

"అక్కా" వెక్కుతూనే అరిచింది మానస. "ప్లీజ్ అక్కా, అంతపని చేయకు. ప్లీజ్, నీకేమయినా అయితే, ఇక్కడ నేనూ చచ్చిపోతాను."

"అంత మాటనకమ్మా మనూ, నేను బ్రతికుంటే నీకన్నీ కష్టాలే. మళ్లీ మళ్లీ డబ్బు తెమ్మని నన్ను హింసిస్తుంటాడు మీ బావ. నావల్ల నా బంగారు చెల్లి ఇబ్బంది పడ్డం నాకిష్టం లేదు. అందుకే వెళ్లిపోతున్నాను. మరో అరగంటలో నా ప్రాణాలు గాలిలో కల్సిపోతాయి. నా బిడ్డను నువ్వు చూస్కుంటావు కదూ."

"అక్క, నీవల్ల నాకిబ్బందులేంటక్కా. నాకసలు డబ్బు ప్రాబ్లమే లేదు. ఎన్నిసార్లయినా బావకు డబ్బు పంపించగలను. నువ్వు లేకుండా మాత్రం నేను బ్రతకలేను. బావ ఎంత డబ్బడిగినా ఇచ్చేద్దాం. ఏదో ఒకరోజు బావ తప్పకుండా మారతాడక్కా. రేపే నేను డబ్బు తీసుకొని బయల్దేర్తాను. నువ్వు మాత్రం ఎలాంటి అఘాయిత్యం చేసుకోకూడదక్కా. ప్లీజ్!" చెంపల మీదుగా జారుతూ నోట్లోకి వెళుతున్న కన్నీరును తుడుచుకుంటూ అంది మానస.

బయట కారులో కూర్చున్న అవినాష్, మానస ఇంకా రాలేదేంటని హారన్ మోగిస్తున్నాడు.

"లేదమ్మా, నీవు యాభైవేలు పంపించి నెల కూడా కాలేదు. మళ్లీ ఇరవై వేలు కావాలంటున్నాడమ్మా. అతని ఆశకు హద్దు-" ఆమె పూర్తి చేయకుండానే మధ్యలోనే కల్పించుకుంది మానస.

"ఇరవై వేలేకదక్కా, రేపే తీసుకొస్తాను. ఈలోగా నువ్వేమైనా చేస్కుంటే నేను మిగలనని గుర్తుంచుకో."

"అంత మాటనకు మనూ, నీవు నాకు చెల్లెలే కాదు, కూతురువి కూడా."

"అయితే నీవు ఎలాంటి అఘాయిత్యం చేసుకోనని నాకు మాటివ్వు."

"అలాగే మనూ. నేనేమీ చేసుకోను. నీకోసం, నా బిడ్డ కోసమైనా ఈ హింసలు భరిస్తాను. కానీ నీవు నాకో మాటివ్వాలి."

"ఏంటక్కా" మానస మనసు కుదుటపడింది.

"ఎట్టి పరిస్థితుల్లోనూ, నా గురించి బావతో గొడవ పడకూడదు. అతను నిన్నేమైన అంటే, అప్పుడే నేను ప్రాణాలు విడుస్తాను. ఇక్కడికొచ్చిన తరువాత మీ బావతో జాగ్రత్తగా వుండాలి. ఎప్పుడు బాగా మాట్లాడ్తాడో, ఎప్పుడు రాక్షసుడవుతాడో తెలియదమ్మా."

"అలాగే అక్కా. నేను రేపు మధ్యాహ్నం బయలుదేర్తాను."

"అలాగేనమ్మా. నీకోసం ఎదురుచూస్తుంటాను."

అంతవరకూ నిలబడి మాట్లాడిన మానస, ఫోన్ పెట్టేసి, ప్రక్కనే ఉన్న సోఫాలో కూలబడింది.

సరిగ్గా అప్పుడు అవినాష్ లోపలికొచ్చాడు. మానస కూర్చున్న తీరు చూసి, ఏదో జరిగివుంటుందని ఊహించి, వెళ్లి ఆమె ప్రక్కనే కూర్చున్నాడు. మానస అతనివైపు తిరిగి కూడా చూడలేదు. అతనే ఆమె భుజంపై చేయి వేసి 'ఏమైంద'ని అడిగాడు.

మానస ఏమీ మాట్లాడకుండా ఏడుస్తోంది.

"ఫోనెవరు చేశారు" మళ్లీ అడిగాడు అవినాష్.

"అక్క"

విసురుగా లేచి నిలుచున్నాడు అవినాష్. "ఛీ, మీ అక్క మనల్ని ప్రశాంతంగా ఉండనివ్వదా" అన్నాడు కోపంగా.


మానస కూడా లేచి నిలబడింది, "ప్లీజ్, ఆగండి, అసలేం జరిగిందో మీకు తెలియదు."


"ఏం జరిగినా నాకనవసరం. ఈ క్షణం నుండి నువ్వు మీ అక్క పేరెత్తకుండా ఉండగలిగితేనే మనం కలిసి జీవిస్తాం. లేదంటే మీ అక్క దగ్గరికే వెళ్లిపో." ఆవేశంగా అన్నాడు అవినాష్.

"దయ్యం పట్టినట్టు పట్టింది నిన్ను, మీ అక్క."

"స్టాపిట్.. అరిచింది మానస, మరొక్క







## అంతుచిక్కని అంతరంగం

'లగాన్' సినిమా తరువాత అమీర్‌ఖాన్ ఇమేజ్ బాగా పెరిగిపోయింది. తమకి ఇష్టమైన వ్యక్తుల్ని జీవితాంతం జ్ఞాపకం ఉంచుకునేలా ఏదైనా చేయాలనుకోవడం సహజం అంటున్న అమీర్ తాను నటిస్తున్న 'ది రైజింగ్ వండర్' చిత్ర నిర్మాతలనుంచి తనకి రావాల్సిన పారితోషికాన్ని ముందే తీసేసుకోవాలనుకుంటున్నాడట. అలా తీసుకున్న ఏడుకోట్లతో ప్రముఖ సంగీత దర్శకుడు బాబా అజ్మీతో కలిసి ఓ ఆల్బమ్ రూపొందించాలనుకుంటున్నట్టు ఆయన సన్నిహిత వర్గాల కథనం. ఈ ఆల్బమ్‌ని కైఫీ అజ్మీకి అంకితం ఇవ్వాలనుకుంటున్నాడట. ఇంతకీ ఈ ఆలోచన ఎలా వచ్చిందో పక్కనపెడితే తాను సంపాదించుకున్న సొమ్ముని ఇలా ఆల్బమ్‌ల పైన ఖర్చుపెడుతున్న అమీర్ మనస్తత్వం ఎవరికీ అంతుచిక్కడంలేదు.




మాట మా అక్క గురించి మాట్లాడితే సహించేది లేదు."

ఒక్కసారి మానస మొహంలోకి తీక్షణంగా చూసి, బయటకు నడిచాడు అవినాష్. మానస అలాగే నిల్చుండిపోయింది.

తర్వాత, ఒక నిర్ణయానికి వచ్చినదాన్లా, తన కొలీగ్‌కు ఫోన్ చేసి అర్జంటుగా డబ్బు కావాలని అడిగింది, తరువాత బట్టలు సర్దుకుంది. తరువాత ఆ రాత్రికే వైజాగ్‌కు ఫ్లైట్ టికెట్ బుక్ చేసుకుంది.

★ ★ ★

మానస అక్క పేరు మమత, బావ నవీన్. ఇన్‌కంటాక్స్ ఆఫీసులో పనిచేస్తాడు. వారికి ఐదేళ్ల కూతురు.

ఉదయం మూడు గంటలకల్లా అక్క ఇంటి ముందు టాక్సీ దిగింది మానస. మేన్‌గేటు తెరుచుకుని ఇంటి కాంపౌండ్‌లో అడుగు పెట్టగానే, అక్కడ కారు పార్కు చేసి ఉండటం చూసి ఆశ్చర్యపోయింది.

కాలింగ్ బెల్ నొక్కిన ఐదు నిమిషాల తరువాత డోరు తెరుచుకుంది.

ఎదురుగా అక్క. గట్టిగా కౌగిలించుకుంది. దుఃఖం పొంగుకొచ్చింది.

పది నిమిషాల తరువాతగానీ వారి ఏడుపు ఆగలేదు. వారి కౌగిలి విడిపోలేదు. తరువాత మానసను తన కూతురు గదిలోకి తీసుకెళ్లి, మరో గంటసేపు భర్త పెడుతున్న హింసలను ఏకరువు పెట్టింది మమత. తరువాత మానసను కాసేపు విశ్రాంతి తీసుకోమని చెప్పి, ఆమె తన బెడ్రూంలోకి వెళ్లింది.

ఉదయం మానస నిద్రలేచే సమయానికి, బావ నవీన్ ఆఫీసుకు వెళ్ళడానికి రెడీ అయాడు. మానసను చూడగానే చిరునవ్వుతో పలకరించాడు.

"ఎలా ఉన్నావు మానస."

బాగున్నానన్నట్టుగా తలాడించింది. బయటకు ఎంతో ప్రేమగా మాట్లాడతాడు, మేకవన్నె పులి అనుకుంది మనసులో.

"ఏదైనా విశేషమా, సడెన్‌గా ఊడిపడ్డావు" మానస నుండి ఏ సమాధానం రాక పోయేసరికి, "బయటకు వెళ్లాలంటే కారు తీసుకెళ్ళు, నేను బైక్‌లో వెళ్తాను" అన్నాడు.

"అక్కర్లేదు" కర్కశంగా చెప్పింది మానస.

మానసకుఅతన్ని చూస్తేనే అసహ్యమేస్తోంది. అసలు మాట్లాడకూడదనుకుంది కాని అక్క చెప్పిన మాటలు గుర్తొచ్చి సహిస్తోంది.

నవీన్ వెళ్లిపోయిన తరువాత, "కారెప్పుడు కొన్నారక్క" అక్కను అడిగింది.

"పదిహేను రోజులవుతుంది. సెకండ్ హాండ్. ఈ పాపిష్టి కారుకోసమే నీ దగ్గర నుండి యాభైవేలు తెమ్మని నా ప్రాణాలు తీసింది."

తరువాత, మానస బాత్రూంలోకెళ్లి, రెడీ అయి, బ్రేక్‌ఫాస్ట్ చేసి తన పాత స్నేహితులను కలవడానికెళ్లింది.

స్నేహితులతో కూర్చొని మాట్లాడతోందేగానీ, మానస ఆలోచనలన్నీ అవినాష్ చుట్టే తిరుగుతున్నాయి. ఏం చేస్తూంటాడు. తన గురించి గాభరా పడి ఉంటారు. నా ఫ్రెండ్స్ దగ్గరికి వెళ్లి నేను వైజాగ్ వచ్చేసిన విషయం తెలుసుకొని వుంటాడు. మరి తనకు ఫోన్ ఎందుకు చేయలేదు. ఒకవేళ ఈమెయిల్ చేశాడేమో.

వెంటనే వెళ్లి ఈమెయిల్స్ చెక్ చేసుకుంది. అవినాష్ మెయిల్ చేయలేదు.

మధ్యాహ్నం రెండు గంటలకల్లా ఇంటికొచ్చేసింది.

"అక్కా నాకేమైనా ఫోన్ వచ్చిందా" వస్తూనే అడిగింది.

"లేదు మనూ, ఈరోజు ఉదయం నుండీ ఫోను పనిచేయడం లేదు."

★ ★ ★

రెండు రోజులు మామూలుగానే గడిచిపోయాయి.

"అక్కా, నేను బయటకు వెళ్తున్నాను. ఈమెయిల్స్ చెక్ చేసుకొని ఒక గంటలో తిరిగి వచ్చేస్తాను" అంది మానస.

"సరే" బెడ్రూంలోనుండె సమాధానమిచ్చింది మమత.

హేండ్ బ్యాగ్ చేతిలోకి తీసుకొని, డోరు తెరిచి బయట అడుగుపెట్టింది మానస.

సరిగ్గా అప్పుడే వర్షం మొదలైంది. టెర్రెస్‌పైన బట్టలు ఆరేసిన విషయం గుర్తొచ్చి గబగబా మెట్లెక్కి పైకెళ్లింది.

సడెన్ బ్రేకుతో ఇంటిముందు కారు ఆగగానే తిరిగి చూసింది. నవీన్ కారు దిగి, విసురుగా డోరు మూసి, గేటు తెరుచుకుని పెద్ద పెద్ద అడుగులు వేసుకుంటూ ఇంట్లోకి వెళ్లాడు.

ఇంట్లో అడుగుపెడుతూనే "మమతా" అంటూ అరిచాడు.

పైన బట్టలు తీస్తున్న మానస మనసు కీడును శంకించింది. తన బావ ప్రవర్తన గురించి అక్క చెప్పగా విందేగానీ ఎప్పుడూ ప్రత్యక్షంగా చూడ

లేదు. ఈరోజు చూడబోతోంది. గబగబా బట్టలు తీసుకొని క్రిందికి దిగింది.

"మమతా" మళ్లీ అరిచాడు నవీన్.

"అబ్బబ్బా, ఏంటండీ" అంటూ బెడ్‌రూంలో నుండి బయటకు వచ్చింది మమత.

"మానస ఇంట్లో ఉందా" అడిగాడు నవీన్.

"లేదు, ఇప్పుడే బయటకు వెళ్లింది, ఎందుకూ?"

"నువ్వేం చేస్తున్నావో నీకు తెలుస్తోందా?" గొంతు తగ్గించి అన్నాడు నవీన్. "అత్యాశకుపోయి నీ చెల్లి జీవితాన్ని నాశనం చేస్తున్నావు."

మెట్లు దిగి ఇంట్లోకి వెళ్ళాలనుకున్న మానస, ఈ మాటలు వినగానే కిటికీ దగ్గరే ఆగిపోయింది. కిటికీకి కర్టెన్ వుండడంతో వాళ్ళు కనపడ్డం లేదు కాని మాటలు క్లియర్‌గానే విన్పిస్తున్నాయి.

"అరవకండి, ఏం జరిగిందో చెప్పండి" అక్క గొంతులో కమాండింగ్ మానసను ఆశ్చర్యపరిచింది.

"మన గురించి, మానస అవినాష్‌తో గొడవ పెట్టుకొని వచ్చింది, తెలుసా."

"తెలియదు. కానీ ఊహించాను. అంతా మన మంచికే అనిపించింది. అందుకే, అవినాష్ ఫోన్ చేస్తాడేమోనని నేనే ఫోన్ కనెక్షన్ కూడా తీసేశాను" అంది మమత.

"ఛీ.. నువ్వు మనిషివేనా, డబ్బుకోసం స్వంత చెల్లెలు-"

"ఆపండి," అతడ్ని మాట్లాడనివ్వలేదు. "నా కోర్కెలు తీర్చడం మీకెలాగూ చేతకాదు. మీకొచ్చే జీతంతో సంసారం ఎలా నడుస్తుందనుకుంటున్నారు. అందరిలాగా మీరూ ఎక్స్‌ట్రాలు సంపాదించండంటే సంపాదించరు. లంచం తీసుకోడానికి భయం." భర్త కోపంగా చూడ్డంతో ఒక్క క్షణం ఆగింది. "అయినా నేను మోసం చేసేది నా చెల్లెల్నే కదా. అదీ, దాని భర్తా కలిసి నెలకు అరవై వేలు సంపాదిస్తున్నారు. వాళ్లకింకా పిల్లలు కూడా లేరు. ఏం చేస్కుంటారు అంత డబ్బు. అందుకే మీరు నన్ను హింసిస్తున్నారని చిన్న అబద్దం చెబుతున్నాను. లేదంటే, నాకు బ్యూటీపార్లర్‌కు వెళ్ళడానికి డబ్బుల్లేవంటే పంపుతుందా, కారు కొనుక్కోడాన్కి డబ్బిమ్మంటే ఇస్తుందా? అందుకే నాటకమాడుతున్నాను. ఆ డబ్బుతో మీరూ ఎంజాయ్ చేస్తున్నారు. ఆ విషయం మర్చిపోకండి."

"కానీ అది జీవితం పాడుచేసుకుంటుంటే నేను చూడలేను. ఇంతక్రితమే, స్టేషన్‌లో దిగి అవినాష్ నాకు ఫోన్ చేశాడు. మానసను తీసుకెళ్ళడానికొచ్చాడు-" అన్నాడు నవీన్.

"మరీ మంచిది. తీసుకెళ్ళనివ్వండి, దాని ముందు నేను కూడా ఎంజాయ్ చేయలేకపోతున్నాను. మీరు ఈ ఒక్కరోజు నటించండి చాలు."

"ఇక నావల్ల కాదు."

"చూడండీ, మనుషులు రెండే రకాలు. మోసం చేసేవాళ్ళు, మోసపోయేవాళ్ళు. నేను మొదటి రకంలో ఉండడానికే ఇష్టపడ్తాను. మీరు ఈ ఒక్క రోజు నాతో సహకరిస్తే చాలు. ప్లీజ్."

"మమతా-" ఏదో అనబోయాడు నవీన్.

"ఇక మీరేం మాట్లాడకండి" గారంగా అంటూ, అతని చేయి పుచ్చుకొని బెడ్రూంలోకి తీసుకెళ్లింది మమత.

ఇదంతా వింటున్న మానస, షాక్‌తో అలాగే నిలబడిపోయింది. భుజంపై చేయి పడ్డంతో అదిరిపడి వెనక్కు తిరిగింది.

అవినాష్ నిలబడి ఉన్నాడు.

"అవి" పెదాలు మాత్రం కదిలించింది. మాట బయటకు రాలేదు. చేతిలో ఉన్న బట్టలను క్రింద పడేసి గట్టిగా కౌగిలించుకుందతన్ని.

"నేనేదో కోపంలో అంటే ఇలా వచ్చేయడమేనా మనూ" ఆమె చుట్టూ చేతులేస్తూ అన్నాడు అవినాష్.


"నన్ను క్షమించు అవి. ఇంతకాలం నిజంగానే నన్ను దయ్యం పట్టింది" ఏడుపు ఆపుకోడాన్కి ప్రయత్నిస్తోంది. "అక్క, అక్క..." అంటూ ఇంకా మాట్లాడబోతోంటే వారించాడు అవినాష్.

"నేనంతా విన్నాను. ఇప్పుడేం మాట్లాడకు. ఏమీ తెలియనట్టుగానే ఇక్కడి నుండి వెళ్లిపోదాం."

మరో రెండు గంటల తరువాత ట్రెయిన్‌లో వెళ్తున్నప్పుడు మానసతో చెబుతున్నాడు అవినాష్. "... మనూ, మీ అక్కను ద్వేషించకు. ఒకప్పుడు మీ అక్క నీపై చూపిన ప్రేమ, ఆప్యాయతలు అన్నీ నిజాలే. నాటకం కాదు. కానీ మనుషులు మారుతారు. సమస్యల వలన, అవసరాల వలన, కోరికల వలన మనుషులు మారతారు. ఆ విషయం తెలుసుకోకపోవడం నీ తప్పు. నిజానికి నీవు చాలా అదృష్టవంతురాలివి. నీకు నిజం త్వరగా తెల్సింది. కొందరు జీవితకాలంలో కూడా తెలుసుకోలేరు. ఎవరి కోసమో త్యాగాలు చేస్తూ, మరిన్ని త్యాగాలు చేయలేకపోతున్నందుకు వారిలో వారే కుమిలిపోతూ జీవిస్తారు.

ఇప్పటికైనా జీవితాన్ని అర్థం చేసుకో. నీవు జీవిస్తున్నది నీ కోసమే. కేవలం నీకోసం. మరొకరి కోసం కాదు. త్యాగాలు చేయడం మనిషి బలహీనత మాత్రమే. గొప్పతనం కాదు."

★



## గాలి అమ్మతా!

మంచినీళ్ళు అమ్మగా లేనిది, గాలి అమ్ముకుంటే తప్పేమిటట... అంటున్నారు మెక్సికన్‌లు. మెక్సికో లాంటి నగరంలో ట్రాఫిక్ కాలుష్యం గురించి మనకు తెలిసిందే. హాంగోవర్ తగ్గాలన్నా, తలనొప్పి తగ్గాలన్నా అక్కడి ప్రజలు ఆక్సిజన్ బార్‌లని నమ్ముకుంటున్నారు. విస్కీ, బ్రాందీ ఇచ్చే కిక్కుకన్నా ఈ ఆక్సిజన్ థెరపీ బావుందిట. నిముషానికి మన కరెన్సీలో 30 రూపాయలు చెల్లించి 5, 10, 15 నిముషాల పాటు ఈ ఆక్సిజన్ బారుల్లో వెళ్ళి హాయిగా గాలిపీల్చుకు రావడం ఇప్పుడు అక్కడి ఫ్యాషన్‌గా మారింది. రోజువారీ జీవితంలో క్షణం తీరికలేని మనం హాయిగా ఆక్సిజన్ బార్‌కి వెళ్ళి ఓ పది నిముషాలు గాలిని పీల్చుకుని వస్తే ఎంత రిలాక్స్‌గా వుంటుందో మీకు తెలియాలంటే మెక్సికో వెళ్ళి రావాల్సిందే.

– శశి

